

బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు

- ఎంపీ బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 26: బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శించారు. పార్లమెంట్ నియోజక వర్గంలోని మండలాల ఇన్‌చార్జిలతో కరీంనగర్‌లో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటీఆర్, పొన్నం ఒక్కటేనన్నారు. ఇద్దరు కలిసి బీజేపీని ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. బీజేపీ ఎంపీలను గెలిపిస్తేనే తెలంగాణకు అత్యధిక నిధులు వస్తాయన్నారు. కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. దేశమంతా మోదీ గాలి వీస్తోందని తెలిపారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందని, ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. బీజేపీలో చేరే నాయకులపై దృష్టి సారించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ సర్వే చూసినా బీజేపీ భారీ మెజారిటీతో గెలుస్తుందని నివేదికలు వస్తున్నాయన్నారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించడంతోపాటు పరిష్కా రానికి కృషి చేయాలన్నారు. నియోజక వర్గ పరిధిలో రోడ్ల నిర్మాణానికి అత్యధిక నిధులు తీసుకు వచ్చానన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఊరూరా ప్రస్తావించాలని, ఆరు గ్యారెంటీల అమలులో జాప్యాన్ని ఎండగట్టాలన్నారు బూత్ కమిటీలను పటిష్టం చేయాలని, ప్రముఖులను రంగంలోకి దించాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్, జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.







'వెలిచాల'వైపే ఎమ్మెల్యేల మొగ్గు

- చక్రం తిప్పిన మంత్రి పొన్నం
- నేడో, రేపో టికెట్ ప్రకటించే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు పేరు ఖాయమని తేలిపోయింది. నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ రాజేందర్‌రావుకు టికెట్ ఇప్పించే విషయంలో చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఆయన సహా మరో ముగ్గురు ఎమ్మెల్యేలు, మిగతా మూడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు రాజేందర్‌రావు అభ్యర్థిత్వాన్ని బలపరచడంతో ఆయన పేరును అధిష్ఠానం ఖరారు చేయనుందని తెలిసింది.

హైదరాబాద్‌కు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు


మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు మేరకు మానకొండూర్, చొప్పదండి, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లారు. వీరంతా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమై రాజేందర్‌రావుకే టికెట్ ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరాలని నిర్ణయించుకున్నారు. రాజేందర్‌రావుకు కాని పక్షంలో తీన్మార్ మల్లన్నకు టికెట్ ఇవ్వాలని ప్రతిపాదించాలనుకున్నట్లు సమాచారం. అనంతరం వారు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి రాజేందర్‌రావు అభ్యర్థిత్వాన్ని తాము కోరుకుంటున్నామని ఏకాభిప్రాయంగా చెప్పినట్లు తెలి సింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ ప్రతిపాదనను ఆయన ముందుంచారని సమాచారం. మంత్రి, ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్‌చార్జీలందరూ ఏకాభిప్రాయంతో తనవద్దకు వచ్చి రాజేందర్‌రావుకు టికెట్ ఇవ్వాలని కోరడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిసింది. నియోజకవర్గంలో చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, ఇతరత్రా వ్యవహారాల గురించి ముఖ్యమంత్రి వారితో చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రాజేందర్ రావు అభ్యర్థిత్వంపై సానుకూలత వ్యక్తం చేయడంతో బుధవారం ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనను తెలియజేసిఅభ్యర్థిని ప్రకటించే అవకాశాలున్నాయని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

సామాజిక సమీకరణాలే కీలకం

కరీంనగర్ స్థానం నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, రుద్ర సంతోష్‌కుమార్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును రాష్ట్ర కమిటీ ఖరారు కేంద్ర కమిటీకి ఆయన ఒక్కరిపేరునే పంపించినా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించే సీట్లు ఎక్కువవుతున్నాయనే కారణంగా పెండింగ్‌లో పెట్టారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన రుద్ర సంతోష్‌కు సీటు ఇవ్వాలని ఆ సామాజిక వర్గం నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వెలమ సామాజికవర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించని నేపథ్యంలో వెలిచాల రాజేందర్‌రావు పేరు ప్రధాన పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మంత్రి, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలంతా కూడా ఏకాభిప్రాయంతో రాజేందర్‌రావు అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం ముందుంచడంతో వెలమ సామాజిక వర్గం నుంచి ఆయన పేరు ప్రకటిస్తారని భావిస్తున్నారు.

గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, మార్చి 26: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ, గిరిజన సంక్షేమ గురుకులాల సంస్థ విద్యాలయాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ రీజియన్ గురుకుల సంక్షేమ ప్రాంతీయ సమన్వయాధికారి వి.లక్ష్మంజలి దేవి ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌డబ్ల్యూఆర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ), అల్గునూర్, గౌలిదొడ్డిలోని పాఠశాలల్లో తొమ్మిదో తరగతిలో మాత్రమే రెగ్యులర్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. టీటీడబ్ల్యూ ఆర్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిగి (బాలి కలు), ఖమ్మం(బాలురు)లో ఎనిమిదో తరగతిలో మాత్రమే రెగ్యులర్ అడ్మి షన్లను తీసుకుంటున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 30 వరకు గడువు ఉందన్నారు. ఖాళీల వివరాలను, ఆన్ లైన్ దరఖాస్తు కోసం www.tswreis.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు.



అరకొరగా 'మిషన్ భగీరథ' నీరు

మార్చిలోనే ఎండలు దంచుతున్నాయి.. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ప్రారంభమవుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గడంతో అరకొరగా నీటి సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాలకు పూర్తిగానే రావడం లేదు. వచ్చిన నీరు శుభ్రంగా లేకపోవడంతో ప్రజలు తాగేందుకు ఇష్టపడడం లేదు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే వచ్చే రోజుల్లో ఎలాంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



దిగువ మానేరు జలాశయం వద్ద నిర్మించిన మిషన్ భగీరథ ప్లాంటు

చొప్పదండి మండలంలో ఇళ్ల ముందు వృథాగా ఉన్న పైపులు



ఎల్ఎండీ కాలనీలోని ఫిల్టర్ హౌస్

- తగ్గుతున్న నీటి లభ్యత
- శుభ్రంగా లేకపోవడంతో ఇష్టపడని ప్రజలు
- గ్రామాల్లో మొదలైన ఇబ్బందులు

తిమ్మాపూర్, మార్చి 26: మండలంలో 23 గ్రామాలు, 37 హ్యాబిటేషన్లు ఉన్నాయి. కొత్త, పాతవి కలిపి 71 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ఈ ట్యాంకులను మిషన్ భగీరథ నీటిని అందించేందుకు పైప్ లైన్లను అనుసంధానం చేశారు. శుద్ధి చేసిన జలాలను గ్రామాల్లో ఉన్న ట్యాంకులకు అందించి అక్కడి నుంచి ఇంటింటికి అందిస్తారు. ఈ ట్యాంకులకు ప్రతి రోజు 5,550 కిలో లీటర్ల నీటిని అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతి ఇంటికి నాలుగువందల లీటర్ల నీటిని ఇవ్వాలనే నిబంధన ఉంది. ఆ నీరు ఎందుకూ సరిపోదు. ఆయా గ్రామాల్లో ఉన్న బోరుబావులు, ఇతర నీటి వనరుల ద్వారా నీటిని ట్యాంకుల్లో నింపి సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు, బోరు బావుల నుంచి వచ్చే నీరు కలిసి కలుషితమవుతున్నాయి. దీంతో ప్రజలు ఈ నీటిని తాగేందుకు ఇష్టపడటం లేదు. దాదాపు అన్ని గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌ల నుంచే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. గ్రామాల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో నాచు, క్రిమికీటకాలు, దుమ్ము, దూళి చేరి నీరు మురికిగా వస్తున్నాయి. దిగువ మానేరు జలాశయం నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఎల్ఎండీలో 5.150 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. మిషన్ భగీరథకు ప్రతి రోజు 240 క్యూసెక్కుల నీటిని కరీంనగర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలకు అందిస్తున్నారు. ఎల్ఎండీలో నీరు తగ్గుతుండడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

చొప్పదండికి చేరని 'మిషన్ భగీరథ'

చొప్పదండి: మిషన్ భగీరథ పథకం ప్రారంభమై ఐదేళ్లు దాటినా చొప్పదండి పట్టణానికి ఇప్పటికీ నీరు అందడం లేదు. నీటి సరఫరా సక్రమంగా జరుగకపోవడంతో మున్సిపల్‌శాఖ పాత పద్ధతిలోనే బావుల నుంచి నీటిని తీసుకుని సరఫరా చేస్తోంది. చొప్పదండి నియోజకవర్గానికి మిషన్ భగీరథ నీటిని వేములవాడ మండలంలోని అగ్రహారం పంపుహౌజ్ నుంచి సరఫరా చేస్తారు. దాదాపు 50 కిలోమీటర్ల దూరం కావడంతో చొప్పదండి పట్టణం చివరి ప్రాంతంగా మారి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. పట్టణంలో 20 వేల జనాభా కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా, మిషన్ భగీరథలో మరో ఐదు వాటర్ ట్యాంకులను నిర్మించారు. పట్టణం పూర్తిగా టెయిల్ ఎండ్‌గా మారగా, మార్కెట్ రోడ్, పశువైద్యశాల ప్రాంతంలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల్లోకి నీరు ఎక్కడం లేదు. మిగతా వాటర్ ట్యాంకులకు కూడా అంతంత మాత్రంగా నీరు అందుతుండగా, పట్టణంలో తాగునీటి సమస్య తరచూ ఏర్పడుతుంది. ఇంటింటికి తాగునీరు అందించేందుకు నల్లాలను బిగిం చారు. నీటి సరఫరా లేకున్నా బిల్లులు మాత్రం వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈదులగట్టెపల్లిలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంకు

వారానికి మూడు రోజులే..

గంగాధర: మండలంలో తాగు నీటికి కష్టాలు మార్చిలోనే ప్రారంభమైయ్యాయి. మండలంలో 33 గ్రామ పంచాయతీలుండగా ఐదు గ్రామాలకు భగీరథ నీరు రావడం లేదు. చేతి పంపులు కూడా మరుగునపడ్డాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి నీటి మట్టం తగ్గడంతో ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చర్లపల్లి (ఆర్), చర్లపల్లి (ఎన్), కోట్ల నర్సింహుల పల్లి, కుర్మపల్లి గ్రామాలకు భగీరథ నీరు రావడంలేదు. సర్వారెడ్డిపల్లి గ్రామ పరిధిలోని మద్దిగడ్డ 230 కుటుంబాలు,కోట్ల నర్సింహులపల్లి కొత్తవాడలోని 70 కుటుంబాలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చర్లపల్లి (ఎన్)కు భగీరథ నీరు రాకపో వడంతో లక్ష్మీదేవిపల్లి శివారులో సంపు ఏర్పా టు చేసి పంపింగ్ చేయడానికి నాలుగేళ్ల క్రితం అధికారులు నిధులు మంజూరు చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో స్తంభాలు వేసి తీగలు అమర్చారు. సంపును మాత్రం తవ్వకుండా వదిలేశారు. దీంతో ఆ గ్రామానికి ఇప్పటికి భగీరథ నీరు అందడం లేదు.

- **మానకొండూర్:** మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లి, వన్నారం గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు మంచినీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈదులగట్టెపల్లి ట్యాంకుకు భూమి సమస్య ఉండడం వల్ల పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. వన్నారం గ్రామంలోని దళితవాడలో మిషన్ భగీరథ నీటి సరఫరాలేక బోరు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందడం లేదని, వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- **చిగురుమామిడి:** మండలంలో 17 గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ అరకొరగా వస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వస్తున్న నీరు మురికిగా ఉంటున్నాయి. వాటిని తాగలేక మినరల్ వాటర్ ప్లాంట్లలో కొనుక్కుంటున్నారు.
- **రామడుగు:** మండలంలోని గ్రామ పంచాయతీల్లో 30 నుంచి 40 శాతం వరకే మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోంది. తిరుమలాపూర్ పరిధిలోని కారుపాకులపల్లిలో నీటి సరఫరా తక్కువగా అవుతుంది.



చొప్పదండిలో మంచినీటిని అందిస్తున్న బావి

రాజకీయ అనుమతులు సకాలంలో ఇవ్వాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రచారానికి సంబంధించిన దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించి సకాలంలో అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన మొదటి విడత పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సువిధ కింద ఎన్నికల ప్రచారం, సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుపుకునేందుకు అనుమతి కోసం రాజకీయ పార్టీల నాయకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు అధికారులు చెక్ చేసుకోవాలని అన్నారు. ఎక్కడ జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలని, సువిధ కింద రాని వాటికి సంబంధించిన అనుమతులపై సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించాలని తెలిపారు. పకడ్బందీగా ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని, ఎల్లపుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, డీపీవో రవీందర్, డీఐవో శివరాములు, ఎస్వో దత్తారెడ్డి పాల్గొన్నారు.

మధ్యమానేరులో మట్టి నింపడంపై పోలీసులకు ఫిర్యాదు

తంగళ్లపల్లి, మార్చి 26: నిబంధనలకు విరుద్ధంగా మధ్య మానేరు ప్రాజెక్టులో మట్టి నింపిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులో మధ్య మానేరు నుండి అంతగిరి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణం చేపట్టారు. కాల్వ పనులు నిర్వహించిన ప్రతిమ కన్స్ట్రక్షన్ నిబంధనలకు విరుద్ధంగా కాలువ నిర్మాణంలో తోడిన మట్టిని మధ్య మానేరులో డంపు చేశారు. దీంతో మధ్య మానేరులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని డంపు చేసిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య పేర్కొన్నారు.

దాడిలో గాయపడ్డ వివాహిత మృతి


మేడిశెట్టి రమ

జగిత్యాలరూరల్, మార్చి 26 : కూతురిని తనకిచ్చి పెళ్లి చేయలేదన్న కోపంతో ఓ యువకుడు వివాహితపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి రమ (40) అనే మహిళకు కొడుకు రిషి, కూతురు వాణి ఉన్నారు. భర్త సురేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. దీంతో రమ స్వగ్రామమైన తిప్పన్నపేటలో నివాసం ఉంటోంది. అదే గ్రామానికి చెందిన బోగు ప్రకాశ్ రమ కూతురు వాణిని పెళ్లి చేసుకుంటానని కొన్ని రోజుల నుంచి వెంటపడుతున్నాడు. దీనికి రమతో పాటు కుమారుడు నిరాకరించారు. ఇదే విషయమై పలుమార్లు వీరి మధ్య గొడవలు జరిగాయి. వాణితో తనకు పెళ్లి కాకుండా అడ్డు పడుతోందనే కారణంగా రమపై ప్రకాశ్ కోపం పెంచుకున్నాడు. రమను చంపేస్తే తన పెళ్లికి ఎవరూ అడ్డుపడరని భావించాడు. సోమవారం తిప్పన్నపేటలో జరిగిన హోలీ వేడుకల్లో భా గంగా రమతో పాటు ఆమె కొడుకుతో గొడవ పడ్డారు. ప్రకాశ్ కొడవలితో రమ గొంతుపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను కరీం నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రమ కుమారుడు రిషి ఫిర్యాదు మేరకు బోగు ప్రకాశ్‌పై హత్య కేసు నమోదుచేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకున్న నారసింహుడు

● ధర్మపురిలో ఘనంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ● పాల్గొన్న జగిత్యాల డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కళ్యాణం, తెప్పె, డోలోత్సవాల అనంతరం స్వామి వారలు దక్షిణం వైపు విహార యాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని దక్షిణ దిగ్యాత్రగా చెబుతుంటారు. ఈ దిగ్యాత్రలో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకవచ్చారు. అనంతరం సేవలపై ఉంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా, రిటైర్డ్ ఏఎస్‌ఐ కమటం మల్లయ్య, వివిధ రకాల వేషాధారణ, చిన్నారుల నృత్యాలు, బొప్పనపెల్లి ఐలయ్య ఒగ్గు డోలు ప్రదర్శనతో సాయంత్రం వేళలో దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్ వైపు తీసుక వెళ్లారు. దారి పొడవుగా పోలీస్ సిబ్బంది ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ గేటు ఎదుట పోలీస్ కుటుంబ సభ్యులు, పలువురు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామి వారల సేవలను పోలీస్‌స్టేషన్‌లోకి ఆహ్వానించారు. జగిత్యాల, డీఎస్పీ రఘుచందర్ ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌బీ సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది స్వామి వారల సేవలను భుజాలపైకి ఎత్తుకుని మోసి లోనికి ప్రవేశించారు. స్వామివారల సేవలను పోలీస్ స్టేషన్ ఆవరణలో అందంగా పూలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉంచారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛ రణల మధ్య యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ అధికారులు తమ ఆయుధాలు స్వామి వారి సేవల పక్కన ఉంచి పూజలు నిర్వహిండం అనాదిగా వస్తుంది. అనంతరం వేద పండితులు, అర్చకులను పోలీస్ శాఖ పక్షాన శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న స్వామివారి సేవలను భుజాలపై మోస్తున్న ధర్మపురి సీఐ, ఎస్ఐ, పోలీస్ అధికారులు



బ్రహ్మపుష్కరిణిలో శ్రీ వేంకటేశ్వరుని తెప్పోత్సవం

ఘనంగా శ్రీ వేంకటేశ్వరుని డోలోత్సవం

ధర్మపురి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య మధ్యాహ్నం ఉత్సవ మూర్తిని సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం పురవీధుల గుండా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)కు తీసుకువచ్చారు. బ్రహ్మ పుష్కరిణిలో హంస వాహనపైన ఉంచిన స్వామి వారల సేవలను ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించి అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేసి అర్చకులు డోలోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు మార్, ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్ల 21 లక్షలు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రూ.2 కోట్ల 21 లక్షలకుపై ఆదాయం సమకూరింది. 21 రోజుల వ్యవధిలో భక్తులు స్వామవారి హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 21 లక్షల 29 వేల 350 రూపాయల నగదు, 463 గ్రాముల బంగారం, 19 కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు పట్టివేత

గంభీరావుపేట, మార్చి 26: గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్ పోస్ట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరళిస్తున్న 1.52లక్షల నగదును మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. సిరిసిల్లకు చెందిన సతీష్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.92 వేల నగదును, గోరంటాలకు చెందిన సత్తవ్వ ఆధారాలు లేకుండా రూ.60 వేల నగదును తీసుకెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. నగదును సీజ్ చేసి, ఎన్నికల సెల్ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్టు ఎస్ఐ రాంమోహన్ వెల్లడించారు.

మల్యాల : ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న నగదును కొండగట్టు బస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన నిమ్మ శివన్న అనే వ్యక్తి కరీంనగర్ నుంచి ఎర్టీగా వాహనంలో లోకేశ్వరంకు రూ.54,500 తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించిన ఆధారాలు లేనందున సీజ్ చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి ముస్తాబు

● నేటి నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు ● 28న స్వామి వారి కల్యాణం.. 30న రథోత్సవం



వేములవాడ ఆలయం



వేములవాడ ఆలయంలో కల్యాణం కోసం ఏర్పాట్లు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం శివకల్యాణోత్సవాలకు ముస్తాబవుతోంది. ఐదు రోజుల పాటు అత్యంత ఘనంగా జరిగే ఈ వేడుకల కోసం ఆలయ అధికారులు సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీ బుధవారం నుంచి 31వ తేదీ ఆదివారం వరకు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు పార్వతీ రాజరాజేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. నాల్గవ రోజు 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05ని.ల నుంచి స్వామివారి రథోత్సవం 31వ తేదీ ఆదివారం శివ కళ్యాణోత్సవాలు ముగుస్తాయి. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ఉత్సవాల కోసం ఆలయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆలయంలోని స్వామివారి కల్యాణ మండపంలో శివ కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తుండగా, ప్రతి ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి ఆలయ చైర్మన్ చాంబర్ ముందు గల ఖాళీ స్థలంలో శివ కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో పందిళ్ల వేయడంతో పాటు అందమైన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాల కోసం యాగశాల నిర్మించారు. ఆలయ గోపురాలను, ప్రాకారాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఈ సందర్భంగా దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణము, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకళ్యాణోత్సవము సందర్భముగా 28వ తేదీ శుక్రవారం రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు కోడె టికెట్లు జారీ నిలిపివేస్తా మని, నిత్య చండీ సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వనున్నట్లు వారు వెల్లడించారు.

భూ ఆక్రమణ కేసుల్లో పలువురి అరెస్టు

● వేర్వేరు కేసుల్లో జడ్పీటీసీ భర్త, కార్పొరేటర్ భర్త అరెస్టు ● అప్పటి తహసీల్దార్ సహా పలువురిపై కేసు



మాజీ సర్పంచ్ పిట్టల రవీందర్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు



ఆకుల ప్రకాష్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్



మంద నగేష్, తిరుపతి విష్ణువర్ధన్‌లను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 26: నకిలీ పత్రాలతో భూఆక్రమణకు పాల్పడిన కేసులో కొత్తపల్లి జడ్పీటీసీ భర్త, చింతకుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవీందర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్‌కు వచ్చిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన పామ్‌రాజ్ గోవిందరావుకు 1954వ సంవత్సరం కాస్రా పహాణి ద్వారా చింతకుంట గ్రామ శివారు సర్వే నంబర్ 106లో ఐదు ఎకరాల 8 గుంటల భూమి ఉండేది. ఆ భూమిలో కుటుంబ సభ్యులు అందరూ అమ్ముకోగా 20 గుంటల భూమి మిగిలి ఉండేది. ఈ 20 గుంటల భూమి ధరణిలో తన తండ్రి పేరే ఉండేదని పామ్‌రాజ్ గోవిందరావు కుమారుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పహాణిలో మాత్రం పేరు టాంపర్ అయి అక్రమంగా న్యాలమడుగు చిన్న వీరయ్య పేరు వస్తున్నది. దీనిని గ్రహించిన అప్పటి సర్పంచ్ పిట్టల రవిందర్ ఆ భూమిని కాజేయాలని వీరయ్య పేరు గల మరో వ్యక్తి కొడుకు రాజయ్య పేరుపై అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి ద్వారా కుమ్మక్కై తప్పుడు విరాసత్ ద్వారా ధ్రువపత్రాలు తయారు చేయించాడు. రాజయ్య నుంచి ముందుగానే నిర్ణయించుకున్న పథకం ప్రకారం గడ్డం ఆదిరెడ్డి పేరున 2009 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించారు. 2010 సంవత్సరంలో ఆదిరెడ్డి నుంచి పిట్టల రవీందర్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తప్పుడు పత్రాలు అడ్డుపెట్టుకుని దానిని దౌర్జన్యంగా దున్నుతున్నాడని, అడ్డుగా వెళ్తే ఆ భూమి తనదేనని, ఇంకోసారి మీరు వస్తే చంపేస్తానని బెదిరింపులకు గురిచేస్తున్నాడని బాధితుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని వెల్లడి కావడంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, దీనికి సహకరించిన అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి, న్యాలమడుగు రాజయ్య, గడ్డం ఆదిరెడ్డిలపై కేసు నమోదు చేశారు. నిందితుడు పిట్టల రవీందర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో ఒకే భూమిని పలువురికి విక్రయం

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలను సృష్టించి ఒకే భూమిని పలువురికి విక్రయించి, మోసం చేసి, బెదిరింపులకు గురిచేసిన ఘటనలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రకాశ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ గ్రామంలో తొమ్మిద్రు నర్సింహారావు 1998లో సర్వే నంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటలు, 161/ఎఫ్‌లో 9 గుంటలు. 162/ఎఫ్‌లో 14 గుంటలు మొత్తం 33 గుంటలు భూమిని కొనుగోలు చేసి ప్లాట్‌లుగా విభజించి పలువురికి విక్రయించాడు. ఇందులో తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన వంతడుపుల సంపత్ అనే వ్యక్తి తొమ్మిద్రు నర్సింహారావు వద్ద 1998లో ఒక ప్లాటును కొనుగోలు చేసాడు. ఇదిలా ఉండగా తొమ్మిద్రు నరసింహారావు పలువురికి విక్రయించిన భూమిని అక్రమంగా మళ్లీ తనపేరిటనే విక్రయ దస్తావేజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని కరీంనగర్ గోదాంగడ్డకు చెందిన అబ్దుల్ హఫీజ్‌కు 33 గుంటలు గుత్తాగా విక్రయించగా, అబ్దుల్ హఫీజ్ అందులో నుంచి సర్వే నెంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటల భూమిని కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. తిరిగి ఆ భూమిలో నుంచి 3 గుంటలు భూమిని కట్టరాంపూర్‌కు చెందిన ఉప్పు సురేష్, వావిలాలపల్లికి చెందిన కట్ట రమ్యలు కావాలనే దురుద్దేశంతో తక్కువ ధరకు కొనుగోలుచేసి అసలు విక్రయదారులైన వారిని ఆ భూమిలోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితుడు వంతడుపుల సంపత్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ చేపట్టారు. విచారణలో బాధితుడు వివరాలు నిజమేనని వెల్లడి కావటంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, అతనికి సహకరించిన ఐదుగురు తొమ్మిద్రు నరసింహారావు, ఆకుల ప్రకాష్, మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్, ఉప్పు సురేష్, కట్ట రమ్యలపై ఎస్సీఎస్టీ కింద కేసు నమోదు చేశారు. కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, నిందితుడికి 14 రోజుల రిమాండు విధించి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో బెదిరించి 5 లక్షలు దోపిడీ - రౌడీషీటర్‌తో పాటు మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలు సృష్టించి, మోసపూరితంగా వాటిని చూపి ఒక వ్యక్తిని బెదిరింపులకు గురిచేసి 5 లక్షల దోపిడీకి పాల్పడిన కేసులో రౌడీషీటర్ తిరుపతి విష్ణువర్ధన్, కాంగ్రెస్ నాయకుడు మంద నగేష్‌లను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం వెదురుగట్టు గ్రామానికి చెందిన పంబాల శ్రీనివాస్ తీగలగుట్టపల్లిలోని కార్తికేయ నగర్‌లో సర్వే నెంబర్ 233/ఇలో ప్లాట్ నెంబరు 120/ఏలో 200 చదరపు గజాల స్థలాన్ని గట్టు లక్ష్మి పేరిట కొనుగోలు చేశాడు. ఆ భూమికి తప్పుడు పత్రాలను చూపించి పంబాల శ్రీనివాస్‌ను రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. 5 లక్షల రూపాయలు శ్రీనివాస్ వారికి ఇచ్చాడు. మరో 15లక్షలు కావాలని డిమాండ్ చేయడంతో పంబాల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని నిర్ధారించారు. రౌడీషీటర్ పద్మశాలివాడకు చెందిన తిరుపతి విష్ణువర్ధన్, కాపువాడకు చెందిన మంద నగేష్‌ను అరెస్టు చేసి మంగళవారం రాత్రి కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనలో తీగలగుట్టపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, తిరుపతి నితిన్‌వర్ధన్‌లపై కేసు నమోదైనట్లు తెలిపారు.

ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి, బాబాయ్‌పై ఫిర్యాదు

బోయినపల్లి, మార్చి 26: శ్రీ రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో భాగంగా ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి సౌమ్య, బాబాయ్ గంద్రవెంకటరమణరావు అక్రమాలకు పాల్పడ్డారని రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య మంగళవారం బోయినపల్లి ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా కొదురుపాక గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ బీపీఎల్ కింద అర్‌అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం పొందారని, అతని సోదరి సౌమ్యకు వివాహం అయినప్పటికీ అక్రమంగా పట్టా పొందారని, అతని బాబాయ్ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెంది గంద్ర వెంకటరమణారావు కూడా అక్రమంగా అర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, పట్టా పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ పట్టాలు, అక్రమంగా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీకి పొందిన వారిపై, సహకరించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 26 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 20 మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు, మైనర్‌కు 3 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఏడుగురు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్షతో పాటు మొత్తం 16 వేల రూపాయలు జరిమానా విధించారని, మరో 12 మందికి 17 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. నగరంలో ప్రతి రోజు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రమాదాల బారినపడి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తలపెట్టవద్దని సూచించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: అతివేగంతో అజాగ్రత్తగా ఆటో నడిపి బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీస్‌లు తెలిపారు. జమ్మికుంటకు చెందిన సుంకిత భవాణి తన భర్తతో కలిసి బైక్‌పై కోరపల్లి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కోరపల్లి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో గౌతమి హాస్టల్ ఎదుట బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆజాగ్రత్తగా నడిపిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: తన తల్లితో సహజీవనం చేస్తున్న ఓ వ్యక్తి తన భర్తను కులం పేరుతో దూషించి కత్తితో పొడిచాడని బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన మానుపాటి పూజిత తల్లి పూలమ్మతో ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన బొమ్మిడి రాజు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల అతిగా మద్యం తాగి వచ్చిన రాజు పూలమ్మను కొట్టడంతో పూజిత తను ఉంటున్న హౌసింగ్‌బోర్డుకు తల్లిని వెంట తీసుకు వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన రాజు అక్కడకు చేరుకుని పూజిత భర్త సురేష్‌ను కులం పేరుతో దూషించి వంట గదిలో ఉన్న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పంచాయతీ పెద్దలపై కేసు నమోదు

రామడుగు, మార్చి 26: పంచాయతీ పెద్దలుగా వ్యవహరిస్తూ ఒకరి సొమ్మును కాజేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గడ్డం వేణు తన భార్యతో విభేదాలు రావడంతో కోర్టు ద్వారా విడాకుల కోసం అంగీకారం కుదుర్చుకున్నాడు. ఈ అంగీకారంలో పంచాయతీ పెద్దలైన రాజు, మల్లేశంలు వేణు నుంచి రెండు లక్షలు తీసుకొని వారి మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్నారు. కాగా బార్యభర్తలకు కోర్టు ద్వారా విడాకుల మంజూరు పూర్తి కాకముందే ఆ ఇద్దరు పెద్ద మనుషులు వేణుకు తెలియకుండా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్న రూపాయలను విత్‌డ్రా చేసుకొని సొంతానికి వాడుకున్నారు. సదరు డబ్బులు తనకు ఇవ్వకుండా వేధిస్తూ మోసం చేస్తున్నారని వేణు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఇద్దరు పెద్ద మనుషులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వివాహేతర సంబంధం ఘటనలో ఏఎస్ఐ సస్పెండ్

ఇబ్రహీంపట్నం, మార్చి 26: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదురాలితో వివాహేతర సంబంధం పెట్టుకున్న జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ రాములును సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్1 ఐజి ఎ.వి. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మహిళ తన భర్త రెండు సంవత్సరాలుగా వేధింపులకు గురి చేస్తున్నాడని తగిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాధిత మహిళను నమ్మించి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. న్యాయం చేస్తానని బాధిత మహిళను నమ్మించాడు. మహిళ ఫోన్‌నంబర్ తీసుకుని ముచ్చటించడంతో పాటు అమెతో వివాహేతర సంబంధం కొనసాగించాడు.

ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న ఏఎస్ఐ రామయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు మల్టీజోన్ -1 ఐజీ ఎ.వి.రంగనాథ్ వెల్లడించారు.

భార్య ఆత్మహత్యకు మరో మహిళ కారణమని హత్య

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. గ్రామంలో పులి రేణుక (40) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ ఆత్మహత్యకు కారణమనే అనుమానంతో పులి పద్మ (45) అనే మహిళను రేణుక భర్త పులి గంగన్న కల్లు గీసే ఉలితో పొడిచి హత్య చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

నాలుగేళ్ల నుంచి రేణుకకు పద్మకు గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో పద్మ ఇటీవల ఫిర్యాదు చేసింది. ఇటీవల రేణుకను మంత్రాల నెపంతో పద్మ మానసికంగా ఇబ్బందులకు గురి చేసింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రేణుక మంగళవారం భర్త ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పని ముగించుకుని ఇంటికి చేరుకున్న భర్త గంగన్న ఇంట్లో ఆత్మహత్య చేసుకుని ఉన్న భార్యను చూసి షాక్‌కు గురయ్యాడు. తన భార్య మృతికి పద్మ కారణమనే అనుమానంతో ఆవేశానికి గురైన గంగన్న తన వద్ద ఉన్న కల్లు గీసే ఉలితో పద్మ ఇంట్లోకి వెళ్లి ఆమెను పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన ధర్మపురి మండలం కమలాపూర్‌లో తీవ్ర విషాదం నింపింది.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

మల్యాల, మార్చి 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న తనను కాదని విడాకులు తీసుకొని మరొకరిని వివాహం చేసుకోవడం జీర్ణించుకోలేని మొదటి భర్త వివాహితను హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మల్యాల సీఐ నీలం రవి హత్య కేసు వివరాలను మంగళవారం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేష్ జగిత్యాలలో వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తుండగా జగిత్యాలకు చెందిన కరిపె అంజలితో 2018లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో 2020లో వివాహం చేసుకున్నారు. సంతానం కలుగక పోవడం, మనస్పర్థలతో తరచూ గొడవలు జరుగడంతో 2022లో ఇద్దరు విడాకులు తీసుకున్నారు. అయినప్పటికీ అంజలికి నరేష్ ఫోన్ చేస్తూ వేధించేవాడు. ఈ క్రమంలోనే అంజలికి యాదాద్రి జిల్లా గుండాల మండలం మాసంపల్లికి చెందిన వ్యక్తితో రెండవ వివాహం జరిగింది. రెండో పెళ్లి చేసుకొని తనను మోసం చేసిందని ఎలాగైని అంజలిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నరేష్ మళ్లీ అంజలికి ఫోన్ చేసి మాయమాటలు చెప్పి జగిత్యాలకు రమ్మని చెప్పాడు. అంజలి కూడా తాను రాను అని తేల్చి చెప్పాలని అనుకొని ఈ నెల 17న జగిత్యాలకు రాగా అక్కడ ఇద్దరు కలుసుకున్నారు. తరువాత జగిత్యాలలో మద్యం కొనుగోలు చేసుకున్న నరేష్ మాట్లాడుకుందామని చెప్పి అంజలిని తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని గొల్లపల్లి, రాయపట్నం మీదుగా మ్యాడంపల్లి శివారు వైపు తీసుకెళ్లాడు. ఎటు తీసుకెలుతున్నావని అంజలి అడుగడంతో ఆమెపై దాడి చేయడంతో పాటు గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలో గల కాలువలో పడేసి వెళ్లాడు. చెప్పులు, చున్నీ, సెల్‌ఫోన్ సంచిలో వేసి పొదల్లో వేసి వెళ్లాడు. మరుసటి రోజు మృతదేహం సమాచారం తెలియడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి గుజ్జుల రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నరేష్ పోలీసులకు దొరకకూడదనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ పారిపోతుండగా మంగళవారం కొండగట్టు వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో పట్టు బడ్డాడు.

నరేష్ వద్ద రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు. అంజలి జగిత్యాలకు వచ్చే ముందు ఈ నెల 15న యాదాద్రి జిల్లా గుండాలలో అదృశ్యం కేసు నమోదు కాగా 17న మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో హత్యకు గురైనట్లు తేలింది.

వృద్ధుల ఆశ్రమానికి వైద్య సహాయకురాలిని నియమించండి

-సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

కరీంనగర్ టౌన్, మార్చి 26: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల వసతి గృహంలో వీలైనంత త్వరగా ఒక వైద్య సహాయకురాలిని నియమించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. మంగళవారం ఆయన వృద్ధుల, వికలాంగుల వసతి గృహం, స్వాధార్ హోంను సందర్శించి వాటిలోని సౌకర్యాలను, వారికి అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులతో ఏదైనా సమస్య వస్తే వార్డెన్‌కు తెలియజేయాలి తప్ప వారిపై దురుసుగా ప్రవర్తించవద్దన్నారు. వారి పట్ల దురుసుగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలు చిన్నతనం నుంచి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.

పిల్లలు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు చెడు మార్గాలు అనుసరించవద్దని అన్నారు. భార్యాభర్తలు క్షణికావేశానికి లోనై గొడవలు చేసుకుంటే పిల్లల బంగారు భవిష్యత్ పాడవుతుందని అన్నారు. బాల్యంలో వారిపై ఎలాంటి చెడు ప్రభావం పడకుండా వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని భార్యభర్తలు కలిసిమెలిసి ఉండాలని, పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని సూచించారు. ఇలాంటి విషయంలో న్యాయపరమైన సహాయాన్ని అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని న్యాయమూర్తి వెంకటేశ్ తెలిపారు. ఈకార్యక్రమంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేశ్ పాల్గొన్నారు.

వాగేశ్వరి కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్



విద్యార్థులు తయారు చేసిన పదార్థాలను రుచి చూస్తున్న అతిథులు

గణేశ్‌నగర్, మార్చి26: నగరంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ సరస్వతి, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ స్వరూప, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ స్వరూప, శాతవాహన యూనివర్సిటీ ఫుడ్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జోసెఫ్ రాజు, కళాశాల ఛైర్మన్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూశారు. పోషక విలువల గురించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రత్నగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సతీశ్‌గౌడ్, లింగ మూర్తి, వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, రమణ, ఏవో నిజామొద్దిన్, ఫుడ్ సైన్స్ లెక్చరర్ అరుణ్ కుమార్, అధ్యాపకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీల్లో అధ్యాపకురాలి ప్రతిభ



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న శకుంతల

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 26: పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో ఈనెల 19నుంచి 23వరకు జరిగిన సీనియర్ జాతీయస్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన మాల్కొండ శకుంతల పాల్గొని విశేష ప్రతిభ చాటింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న శకుంతల రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.

జాతీయ స్థాయి పోటీల్లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో పోటీ ఎడిన ఆమె 5వ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్ర యోగా అసోసియేషన్ ఛైర్మెన్ సర్దార్ రవిందర్‌సింగ్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, పీడీ శ్రీధర్‌రావు, అధ్యాపక బృందం అభినందించింది.

సంపద వనాలను పరిశీలించిన ఎఫ్ఆర్వో



తాడికల్‌లో సంపద వనాలను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో రాజేశ్వర్‌రావు

శంకరపట్నం, మార్చి 26: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సందప వనాలను ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద వనాల్లో నాటిన మొక్కలను సందర్శించి, మొక్కల రక్షణకు ఏర్పాటు చేసిన పోల్స్, ఫెన్సింగ్, గేట్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. సరైన సమయంలో నీరు అందించి మొక్కల ఎదుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, పీఆర్ఏఈ తిరుపతి, ఇరిగేషన్ ఏఈ ఆస్మా, ఏపీవో శారద, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మానకొండూర్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మానకొండూర్, మార్చి 26: మహలక్ష్మీ పథకంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆరు మండలాల ఆటో డ్రైవర్ల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మహలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టడడంతో ఆటోలలో మహిళలు ప్రయాణించకపోవడం వల్ల ఆటో డ్రైవర్లు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో రాష్ట్రంలో 40 మంది ఆటోడ్రైవర్లు కుటుంబాన్ని పోషించలేక తనువు చాలించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఆటో డ్రైవరుకు నెలకు రూ. 15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ, కార్మిక సంఘం నాయకులు రూప్ సింగ్, ఆయా మండలాల ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేసిన కేసీఆర్, ప్రవీణ్‌కుమార్'

హుజూరాబాద్, మార్చి 26: తెలంగాణ రాష్ట్ర ప్రజలను మాజీ సీఎం కేసీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సొల్లు బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ దళిత నాయకులు మందకృష్ణ మాదిగ దళిత వర్గాలను మోసం చేసి బీజేపీకి అమ్ముడు పోయారని తెలిపారు. అలాగే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎన్నో నీతి సూత్రాలు చెప్పి ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీలో చేరారని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాల్లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తాగునీటి సరఫరాపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతకుమారి మాట్లాడుతూ రైతులకు అందు బాటులో ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కేంద్రాల వద్ద ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే వాటిని పరిష్కరించాలని అన్నారు. గన్నీసంచులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్దేశించిన సీఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేయాలని అన్నారు. ప్రణాళికతో ధాన్యం కొనుగోలు చేపట్టాలని, ప్రతి మండలంలో ఏప్రిల్ ఒకటిన ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. మిగతా చోట్ల ఏప్రిల్ 10వరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

● తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు : కలెక్టర్

వేసవి కాలం నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. జిల్లాల్లోని గ్రామాలతో పాటు కరీంనగర్ కార్పొరేషన్, కొత్తపల్లి, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో తాగునీటి ఇబ్బంది రాకుండా చూస్తున్నామని అన్నారు. తాగునీటి సరఫరాపై ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామాన్ని సందర్శించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని అన్నారు. అవసరమైన చోట బోర్‌వెల్స్ పైపులైన్లు ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మత్తు పనులు చేపడుతున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, వ్యవసాయాధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో శ్రీధర్, డీసీవో గౌరీశంకర్, సివిల్ సప్లయీస్ డీఎం రజనీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి

-జమ్మికుంట రూరల్ సీఐ కోరె కిశోర్



సిరిసేడులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

ఇల్లందకుంట, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని జమ్మికుంట రూరల్ సీఐ కోరె కిశోర్ అన్నారు. మంగళవారం మండలంలోని సిరిసేడు గ్రామంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో, స్థానిక పోలీస్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నం చేసినా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. డబ్బు, మద్యం, అక్రమ రవాణ చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజకుమార్, ఏఎస్ఐలు రవి, రవీందర్‌రెడ్డి, సిబ్బంది అశోక్, రమేష్, కమలాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యం'

కరీంనగర్ లీగల్, మార్చి 26: న్యాయవాదుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామని బార్ అసోసియేషన్ ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు ప్రకటించారు. న్యాయవాద వృత్తి గౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యమని అన్నారు. సోమవారం జిల్లా కోర్టు కాంప్లెక్సు ఆవరణలో మీట్ ది బార్ అసోసియేషన్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బార్ అసోసియేషన్ ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు గెలిచిన అనంతరం చేయబోయే కార్యక్రమాలు, వారి లక్ష్యాలను న్యాయవాదులకు వివరించారు. అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తామని అన్నారు. న్యాయవాద వృత్తి సాఫీగా కొనసాగేందుకు మౌళిక వసతులు కల్పించడమే మొదటి ఎజెండాగా తీసుకుంటామని అన్నారు. నూతనంగా వృత్తిలోకి వచ్చే న్యాయవాదుల కోసం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిధులు మంజూరుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు గడ్డం లక్ష్మన్, కట్ట రమేశ్, జక్కనపల్లి గణేశ్‌లు కో ఆర్డినేటర్లుగా వ్యవహరించగా మాజీ అధ్యక్షుడు రఘునందన్‌రావు, పెంచాల ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

కరీంనగర్‌రూరల్, మార్చి 26: కొత్తపల్లిలో శ్రీ వెంకటేశ్వరస్వామి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం మృతికాస్నపనమ్, నేత్రోన్మీలనం, లాజదివాసం, జపతర్పణము, విశేషార్చనలు, తత్త్వన్యాస హవనం, శాంతి హోమం, ధాన్య, పుష్ప, ఫల, శయ్యాదివాసం, గర్తపూజ, యంత్ర, బింబ స్థాపనకార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం శ్రీ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రాణప్రతిష్ఠ, కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. వేద పండితులు వరప్రసాదచార్యులు, పవన్ కుమారాచార్యులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతరం అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నరహరి నారాయణరెడ్డి, రాజభాస్కర్‌రెడ్డి, నరహరి జగ్గారెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, తుమ్మల రమేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, గోనె రాజిరెడ్డి, మేడిపల్లి సత్యవతి, జనార్ధనరెడ్డి, బోగ సుదర్శన్, పోరెడ్డి శ్రీహరిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు వసతి గృహానికి నిధులు ఇవ్వండి

-సీఎం రేవంత్‌రెడ్డికి నాయకుల వినతి



ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని ఇస్తున్న బొమ్మ శ్రీరాంచక్రవర్తి

కరీంనగర్ టౌన్/అర్బన్, మార్చి 26: జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ట్రస్టు భవనం, విద్యార్థి వసతి గృహ నిర్మాణానికి నిధులు మంజూరీ చేయాలని మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, సత్తు మల్లేశం ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపుల సమస్యల పరిష్కారం కోసం, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ట్రస్టు భవన నిర్మాణ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. సమస్యలు విన్న సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి మున్నూరుకాపు సంఘం వసతిగృహాల భవన నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొమ్మ రాధాకృష్ణ పటేల్, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం ఈసీ మెంబర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కోఆర్డినేటర్ వాసాల రాజు పటేల్, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం జాయింట్ సెక్రెటరీ వాసాల వెంకటేశ్వర్లు పటేల్, హఫీజ్ పేట్ మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు మంగళారపు తిరుపతి పటేల్, ప్రధాన కార్యదర్శి వాసాల శ్రీనివాస్ పటేల్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై దృష్టి సారించండి : కలెక్టర్



గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

రామడుగు, మార్చి 26: సాధారణ ప్రసవాలపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించి ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసుపత్రిలోని వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో సకల వసతులు అందుబాటులో ఉన్నాయని గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు పండ్లు, కూరగాయాలు తీసుకుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణీలు యోగా హెల్త్‌డైట్‌పై దృష్టి సారించాలన్నారు. 24గంటలు అత్యుత్తమ సేవలు అందించి, వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సుజాత, తహశీల్దార్ బాస్కర్, ఎంపిడివో రాజేశ్వరీ, వైద్యాధికారి గీష్మన్య, సిబ్బంది ఉన్నారు.

వేంకటేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంగాధర, మార్చి 26: గర్షకుర్తి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం, శేషహోమం, బలిహరం, సాయంత్రం నాకబలి, శ్రీపుష్పయాగం,ద్వాదశ ఆరాధనలు, ఉద్వాసన బలి, గరుడబలి, గ్రామబలి, ఏకాంత సేవా, శయలింపు,లాలిపాటతో ఉత్సవాలు ముగిసాయి. మంగళవారం ఎంపి బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవం సందర్భంగా రంగరావుపల్లి మహిపాల్ ఒగ్గుడోలు బృందం, కోలాటోత్సవం, గర్షకుర్తి గాయనీ,గాయకుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సాగునీరు అందించాలని రైతుల ధర్నా



వరదకాలువపై ధర్నా చేస్తున్న రైతులు

గంగాధర,మార్చి 26: ఎండుతున్న పంటలకు సాగునీరందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్, నిజామాబాద్ జాతీయ రహదారి కురిక్యాల వరద కాలువపై రైతులు సాగునీటికై ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ వరద కాలువను ఆధారం చేసుకుని వేల ఎకరాల్లో వరి సాగు చేశామన్నారు. నీరు విడుదల చేస్తామని చెప్పడంతో ఆశపడి ఎకరాకు 30 వేలు ఖర్చు చేసి వరి సాగు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పాలుదశలో ఉండగా నీరులేక ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాగిరెడ్డిపూర్ వరదకాలువ గేట్లు ఎత్తిన ఒక్క రోజుకే సరిపోయాయని అన్నారు. మరో వారం నీరందిస్తే కానీ పొలాలు గట్టెక్కుతాయన్నారు. వరద కాలువలో నీరులేక ఎండిపోయిందని ఎల్లంపల్లి పంపులతో నీరు ఎత్తిపోస్తుండగా వరద కాలువలోకి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్,ఎస్ఐ కిరణ్‌రెడ్డిలు రైతులను సముదాయించి ధర్నా విరమింపజేశారు. రైతుల ధర్నాతో రహదారిపై కిలోమీటర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో కురిక్యాల, కొండన్నపల్లి, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్షకుర్తి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న వొడితల ప్రణవ్

జమ్మికుంట రూరల్, మార్చి 26: ఆధ్యాత్మిక చింతనతో అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో 25వ వార్షికోత్సవ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ లు చేశారు. ఆలయ అభివృద్ధికి, దీపా, దూప నైవేద్యాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు సిరిమల్లె జయేందర్, మామిడాల మనోహర్, అనుమాస రాజేందర్, ప్రతాప్‌రెడ్డి, మిల్కూరి తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్‌రావు, భాస్కర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: హుజూరాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ సమక్షంలో మంగళవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కమలాపూర్ మండలానికి చెందిన వడ్లకొండ సతీష్‌గౌడ్, కోడిగూటి సంతోష్, ఇసంపల్లి సురేష్ తదితరులు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరగా, వీరికి వొడితెల ప్రణవ్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మిడిదొడ్డి రాజు, బాలసాని రమేష్, దేశిని అయిలయ్య, పోడేటి బిక్షపతి, నాంపల్లి ప్రభాకర్, పెరుమండ్ల పరశురాములు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షలకు 14 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 26: జిల్లాలో పదో తరగతి భౌతిక శాస్త్రం పరీక్షకు 14మంది గైర్హాజరయ్యారు. మంగళవారం పరీక్షకు 12,565మంది హాజరు కావలసి ఉండగా 12,551 మంది పరీక్షలు రాశారు. 92 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా 27 మంది గైర్హాజరు కాగా 65 మంది పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాలో 77 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మంగళవారం 22 పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నామని, ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈవో అన్నారు.

ఈజీఎస్ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

భగత్‌నగర్, మార్చి 26: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులు విస్తృతంగా జరుగుతున్న సందర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో కూలీలకు మంచినీటి సౌకర్యం, నీడ సౌకర్యం కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేయాలన్నారు. ఉపాధిహామీ కూలీలు పనులను ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే కొనసాగించాలన్నారు. ఉపాధిహామీ కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. కొలతలు లేకుండా పనులు కల్పించి కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, మార్చి 26 : కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రచార కార్యదర్శిగా కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన షేక్ అజీమొద్దీన్‌ను నియామకం చేశారు. ఈ మేరకు మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షులు ఎండీ తాజొద్దీన్, ఉపాధ్యక్షులు ఎండీ కలీంలు మంగళ వారం కశ్మీర్‌గడ్డ 54వ డివిజన్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రచార కార్యదర్శిగా అజీమొద్దీన్ నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జస్టిస్ నవీన్‌కుమార్‌కు పరామర్శ



జస్టిస్ నవీన్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎంపీ బండి సంజయ్

భగత్‌నగర్ మార్చి 26: జస్టిస్ నవీన్‌కుమార్‌ను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న జ్యోతినగర్ లోని నవీన్‌కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు బోయినపల్లి ప్రవీణ్ కుమార్, బండ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రారంభం

కరీంనగర్ రూరల్, మార్చి 26: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకును బ్యాంకు చైర్మన్ వై శోభ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు 429 శాఖను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్యాంక్ ద్వారా అందే పలు పథకాలు, మహిళా సంఘాల రుణాలు, పంట రుణాలు, ఎటిఎం, సామాజిక భద్రతా పథకాలు నగదు రహిత లావాదేవీలు వినియోగించుకోవాలని సూచించారు.

ప్రాంతీయ అధికారి ప్రభుదాస్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల పద్ధతులతో పాటు, సురక్షితమైన బ్యాంకింగ్ పద్ధతుల ద్వారా వ్యాపారులు, రైతులు ఖాతాలు తెరిచి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డీఓ పి.సునీత, ఎండీ హసన్, మేనేజర్ దేవసేనారెడ్డి, క్యాషియర్ నాగరాజు, ఎస్ఎంఓ సాయికృష్ణ, ఎస్ఎంబి బిపి రాజు, సిబ్బంది భార్గవి, ప్రియాంక, శ్రవణ్, వినయ్‌కుమార్, రామ్ తేజ, ప్రజలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాల పరామర్శ

గంగాధర, మార్చి 26: మండలంలోని చిన్నాచంపల్లి, ఆచంపల్లి గ్రామాల్లో మంగళవారం మృతుల కుటుంబాలను మాజీ ఎంపి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు.

చిన్నాచంపల్లికి చెందిన గుడి వెంకట్‌రెడ్డి(70), ఆచంపల్లికి చెందిన రుద్ర భూమయ్య(60)లు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలను పరమార్శించిన మాజీ ఎంపి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌లు తమ సంతాపాన్ని తెలిపారు. వారి వెంట గట్టుబూత్కూర్ మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి,నాయుడు ఆకుల మధుసూదన్‌లు పాల్గొన్నారు.

నేడు వార్షిక మహాసభ

సైదాపూర్, మార్చి 26: వెన్కేపల్లి-సైదాపూర్ విశాల సహకార పరపతి సంఘం వార్షిక మహాసభ బుధవారం ఉదయం 11 గంటలకు సంఘం ఆవరణలో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరుగనుంది. ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు, సభ్యులు హాజరై మహాసభ ను విజయవంతం చేయాలని సీఈవో శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు.

నియామకం

చొప్పదండి, మార్చి 26: లయన్స్ క్లబ్ రెండవ ఉప గవర్నర్‌గా మండలంలోని దేశాయిపేటకు చెందిన మోర భద్రేశం ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఎన్ని కల్లో భద్రేశంను ఉప గవర్నర్‌గా ఎన్నుకున్నారు.కాగా భద్రేశం ఎన్నిక కావడం పట్ల చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు

వీణవంక,మార్చి26: మండలంలోని మామిడిలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం విగ్రహ ఉత్సవమూర్తుల ఊరేగింపు కన్నుల పండుగగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ పుర వీధులు గుండా ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు.అనంతరం వేద పండితులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.గణపతి పూజ,గోపూజ,ప్రధాన దేవత స్థాపిత పూజ, అగ్ని ప్రతిష్ఠ చేపట్టారు. యాగశాలను ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమం లో గ్రామస్థులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయంలో పూజలు

ఇల్లందకుంట, మార్చి 26: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ అనుసంధానంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో కాల సర్పదోష నివారణ పూజ కార్యక్రమం అర్చకులు మడికొండ నవీన్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నిత్యవిధి అనంతరం కాల సర్ప దోష నివారణ పూజ కార్యక్రమం చేశారు.

ప్రతి మంగళ వారం ఆలయంలో పితృ సంబంధిత కాలసర్ప అంగారక గ్రహదోష పూజ నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. ఈ దోషం ఉన్న భక్తులు ప్రతి మంగళవారం ఈ పూజ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.